క్లుప్తంగా

స్పాట్ అడ్మిషన్లు

భద్రాచలంటౌన్: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈ నెల 15, 16 తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జాన్‌మిల్టన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించిన, తత్సమాన అర్హత కలిగిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా కళాశాలలో సమర్పించి అడ్మిషన్ పొందాలని సూచించారు.

మున్సిపాలిటీ కమిషనర్‌కు వినతి



వినతిపత్రం అందిస్తున్న గీత కార్మికులు

అశ్వారావుపేటరూరల్: అర్హులైన గీత కార్మికులకు పింఛన్ సౌకర్యాన్ని కల్పించాలని స్థానిక గీత కార్మిక సంఘం బాధ్యులు మున్సిపాలిటీ కమిషనర్ బానోతు నాగరాజును కోరారు. శుక్రవారం కమిషనర్‌కు వినతిపత్రాన్ని అందించి, 50 ఏళ్లు దాటిన నిరుపేద గీత కార్మికులకు పింఛన్లు మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు. వినతిపత్రాన్ని అందించిన వారిలో ఆరేపల్లి గోవింద్, మోర్ల దుర్గారావు, ఆరేపల్లి లక్ష్మణ్‌రావు, పిల్లి శ్రీను పాల్గొన్నారు.

జానకీపురంలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ ప్రియాంక

అన్నపురెడ్డిపల్లి(చండ్రుగొండ): మండలంలోని జానకీపురంలో ఎర్రగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. జ్వర పీడితులతోపాటు దగ్గు, జలుబుతో బాధపడుతున్న వారిని డాక్టర్ ప్రియాంక పరీక్షించి మందులు పంపిణీ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది ప్రకాష్‌రావు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులతో సమావేశం..



మత్స్యకారులతో మాట్లాడుతున్న సీఐ

దుమ్ముగూడెం: మండలంలోని దంతెనం గ్రామంలోని మత్స్యకారులతో సీఐ వెంకటప్పయ్య శుక్రవారం సమావేశం అయ్యారు. మండలంలోని గోదావరి మీదుగా ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు, అక్రమాలు జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మండలంలోని దంతెనం, గంగోలు, సున్నంబట్టి, పర్ణశాల గోదావరి మీదుగా అక్రమ వ్యాపార కలాపాలు సాగుతున్నాయని సమాచారం ఉందని, అక్రమార్కులకు పడవ యజమానులు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని హెచ్చరించారు.

మిషన్ భగీరథ నీళ్లు తాగితే వ్యాధులే.!



జమ్మిగూడెంలో మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ వద్ద పచ్చగా మారిన నీరు

అశ్వారావుపేటరూరల్: స్వచ్ఛమైన తాగునీరు అందించే ఉద్దేశంతో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ పథకం ప్రజారోగ్యానికి ముప్పుగా మారుతోంది. అశ్వారావుపేట మండలం జమ్మిగూడెం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఎదుట ఉన్న మిషన్ భగీరథ ఎయిర్ వాల్వ్ వద్ద కొన్ని నెలలుగా తాగునీరు లీకేజీ అవుతోంది. నీళ్లతో వాల్వ్ చాంబర్ పూర్తిగా నిండిపోయింది. మరమ్మతులు చేయకపోవడంతో నీళ్లు పచ్చ రంగులోకి మారి, పాకురు పట్టింది. దీంతో మిషన్ భగీరథ నీళ్లు సరఫరా సమయంలో కలుషిత నీరే తమ ఇళ్లకు సరఫరా కావడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని గ్రామస్తులు వాపోతున్నారు. తక్షణమే ఈ లీకేజీకి మరమ్మతులు చేసి తాగునీటి కలుషితాన్ని అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

కల నెరవేరుతున్న వేళ..

- కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- సకాలంలో జమ అవుతున్న బిల్లులు
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



పెద్దకమలాపురంలో స్లాబ్ లెవెల్ వరకు చేరుకున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

దుమ్ముగూడెం: ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత రూ.5 లక్షలతో ఇందిరమ్మ ఇల్లు నిర్మించే కార్యక్రమం చేపట్టింది. తొలి విడతలో ప్రతి గ్రామం నుంచి కొందరు లబ్ధిదారులకు ఇళ్లు కేటాయించడంతో వారు సొంతంగా ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నిర్మించుకుంటున్నారు.

మండలానికి 1,151 మంజూరు..

ఇందిరమ్మ ఇళ్లలో మొదట మోడల్ విలేజ్‌గా పెద్దకమాలాపురం గ్రామాన్ని ఎంపిక చేశారు. 128 మంది నిర్మించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. అనుమతి పత్రాలను భద్రాచలంలో జరిగిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఇప్పటివరకు గ్రామంలో 20 ఇళ్లకు మార్కింగ్ ఇవ్వగా 108 పెండింగ్‌లో ఉన్నాయి. మండలవ్యాప్తంగా మొత్తం 15,105 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా ఎల్–1లో 5,687 మందికి గాను 1,151 ఇళ్ల నిర్మాణానికి పరిపాలన అనుమతులు రాగా వాటిలో 676 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇచ్చి పనులు మొదలుపెట్టారు. 403 ఇళ్ల నిర్మాణానికి మార్కింగ్ ఇవ్వాల్సి ఉంది.

నాలుగు దఫాలుగా బిల్లులు..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో బేస్‌మెంట్ వరకు పూర్తి చేసిన వెంటనే అధికారులు ఏఐ టెక్నాలజీతో ఫొటోలను అప్‌లోడ్ చేయగానే వారం రోజుల వ్యవధిలో రూ.లక్ష నగదు లబ్ధిదారుల ఖాతాల్లో జమ అవుతోంది. రూఫ్ లెవెల్ గోడల వరకు నిర్మాణాలు పూర్తి చేస్తే రూ.లక్ష, స్లాబ్ పూర్తయ్యాక రూ.2 లక్షలు, ప్లాస్టరింగ్, డోర్ ఫిట్టింగ్, కలర్ వాషింగ్ పూర్తయ్యాక చివరి బిల్లు రూ.లక్ష అందిస్తారు. లబ్ధిదారుడే ఇంటి నిర్మాణ దశలను అప్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పించడంతో బిల్లుల విషయంలో ఎక్కడ కూడా ఇబ్బందులు ఉండే అవకాశం లేకపోవచ్చు.

కల నెరవేరింది..



15 ఏళ్లుగా సొంత ఇల్లు కోసం ప్రయత్నాలు చేస్తున్నాం. కొన్నేళ్లుగా పూరి గుడిసెలో పాములు, తేళ్ల భయంతో జీవనం కొనసాగించాం. ప్రభుత్వం మా సొంత ఇంటి కల నేరువేర్చుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. స్లాబ్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తయ్యింది. ఒక బిల్లు పడింది. మరో బిల్లు పడాల్సి ఉంది. సొంత ఇంటి కల ఇప్పటికి నెరవేరింది.

–కనుకు జయమ్మ, నర్సాపురం

ఆనందంగా ఉంది..



ఇందిరమ్మ ఇంటి నిర్మాణం స్లాబ్ లెవెల్ వరకు వచ్చింది. వాల్ లెవెల్ బిల్లు పడగానే స్లాబ్ వేస్తాం. సొంత ఇంటికి యజమానురాలిని అవుతున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఇంటి నిర్మాణం కొనసాగుతుంటే బిల్లులు రావడం ఆనందంగా ఉంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులే ఇంటి నిర్మాణ ఫొటోలు అప్‌లోడ్ చేయడం వల్ల ఎలాంటి అక్రమాలు జరిగే అవకాశాలు లేవు.

–గుండ్ల స్రవంతి, నర్సాపురం

ప్రోత్సహిస్తున్నాం...



ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ప్రోత్సహిస్తున్నాం. నిర్మాణాలను ప్రభుత్వ నిబంధనల మేరకు పూర్తి చేయగానే ఫొటోలను అప్‌లోడ్ చేసి బిల్లులు వచ్చేలా కృషి చేస్తున్నాం. వర్షాల వల్ల కొంత ఇబ్బంది ఏర్పడింది. అలాగే నిర్మాణాల్లో జాప్యం జరగకుండా ఇసుక అనుమతులను జారీ చేస్తున్నాం. లబ్ధిదారులు ఎక్కడా ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకుంటున్నాం.

–వివేక్‌రామ్, ఎంపీడీఓ

దినసరి కార్మికుల నిరవధిక సమ్మె



దమ్మపేట: సమ్మె చేస్తున్న కార్మికులు



దుమ్ముగూడెం: సమ్మెకు మద్దతు తెలుపుతున్న అఖిలపక్ష నాయకులు



కరకగూడెం: నినాదాలు చేస్తున్న కార్మికులు

దమ్మపేట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మెబాట పట్టారు. కార్మికులు అందరూ విధులను నిర్వర్తించకుండా, పాఠశాలల ఎదుట సమ్మెలో కూర్చున్నారు. పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాల కార్మికుల సమ్మెకు మద్దతు పలికిన సీఐటీయూ నాయకుడు పిట్టల అర్జున్ మాట్లాడారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించి, కొత్తగా వచ్చిన వేతన విధానాన్ని రద్దుచేసి, పాత పద్ధతిలోనే వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రఘు, దాసు, శ్రీను, బుచ్చన్న, రామలక్ష్మి, రత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటరూరల్: గిరిజన ఆశ్రమ, హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. శుక్రవారం మండలంలోని సున్నంబట్టి, పెదవాగు ప్రాజెక్టు, కావడిగుండ్ల, అనంతారం, భీమునిగూడెం, అశ్వారావుపేటలోని ఆశ్రమ పాఠశాలలు, హాస్టళ్లలో పనిచేస్తున్న దినసరి కార్మికులు విధులను బహిష్కరించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, జేఏసీ నాయకుడు పిట్టల అర్జున్, నాగేశ్వరరావు మద్దతు పలికారు. కార్యక్రమంలో బత్తుల శ్రీను, లక్ష్మీ, నాగమణి, అరుణ, ఎల్లమ్మ, బుచ్చమ్మ, కుమారి పాల్గొన్నారు.

గుండాలలో..

గుండాల: ఆశ్రమ పాఠశాలలు, వసతిగృహాల్లో పనిచేస్తున్న దినసరి కార్మికులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. శుక్రవారం నిరవధిక సమ్మె చేపట్టారు. పది నెలల వేతనాలు విడుదల చేయాలని, క్యాటరింగ్ విధానం రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకటనర్సమ్మ, తోలెం లక్ష్మి, వెంకట నర్సింహ, పార్వతి, బాలయ్య, సమ్మయ్య, సారయ్య, లక్ష్మినారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెంలో..

దుమ్ముగూడెం: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి కూలీల శుక్రవారం నిరవధిక సమ్మెకు దిగారు. తమ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె చేస్తామని వారు పేర్కొన్నారు. శుక్రవారం సమ్మెకు సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా నాయకులు కొమరం చంటి, కారం పుల్లయ్య, జానీపాషా, తాటి పూడి రమేష్ మద్దతు పలకగా.. నోముల రామిరెడ్డి, దాసరి సాయన్న, కణితి రాముడు, కాక సమ్మక్క, తాటి లక్ష్మయ్య, ముర్రం పాపారావు, రాములమ్మ, సుజాత, సత్తమ్మ, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

ములకలపల్లిలో..

ములకలపల్లి: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కన్వీనర్ నిమ్మల మధు డిమాండ్ చేశారు. కమలాపురం ఆశ్రమ పాఠశాల వద్ద శుక్రవారం వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె శిబిరాన్ని సందర్శించి, సంఘీభావం ప్రకటించారు. మోకాళ్ల వెంకటమ్మ, ఊరబెద్ది లక్ష్మి, సడియం పద్మ, జాటోత్ మంగమ్మ, సడియం వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరురూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వసతిగృహాల దినసరి వర్కర్లు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. సమస్యలు పరిష్కరించేంత వరకు సమ్మెను విరమించేది లేదని స్పష్టం చేశారు.

కరకగూడెంలో..

కరకగూడెం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న డైలీవేజ్ కార్మికులు శుక్రవారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు కొమరం కాంతారావు, ఎస్ఎఫ్ఐ నాయకుడు మాదాస్ అఖిల్, డైలీవేజ్ వర్కర్లు కొమరం ముసలయ్య, ఏడూళ్ల పాపయ్య, చర్ప చంటి, చంద్రకళ, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అశ్వారావుపేటరూరల్: అశ్వారావుపేటలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ వెంకటరత్నం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

పౌష్టికాహారం అందించాలి



బీసీ హాస్టల్‌లో పరిశీలిస్తున్న వైద్యులు

పినపాక: విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని పినపాక ప్రభుత్వ వైద్యురాలు దుర్గాభవాని అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రభుత్వ హాస్టల్‌ను పరిశీలించారు. వంటశాలలో శుభ్రతపై ఆరా తీశారు. హాస్టల్ ఆవరణలో నిరంతరం బ్లీచింగ్, దోమల మందు పిచికారీ చేస్తే కీటకాలు రావని తెలిపారు. అనంతరం విద్యార్థులకు హెల్త్ క్యాంప్ నిర్వహించి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు మధు, ఉపాధ్యాయులు హనుమంతు, వెంకట్, ఏఎన్ఎం పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పర్ణశాల రామయ్యను దర్శించుకున్న ఓఎస్డీ



నారచీరల ప్రాంతంలో ఓఎస్డీ కుటుంబ సభ్యులు

దుమ్ముగూడెం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల శ్రీసీతారామచంద్రస్వామిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అడిషనల్ ఎస్పీ, ఓఎస్డీ నరేంద్ర కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అధికారులు ఆలయ మర్యాదలతో వారికి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తీర్థ, ప్రసాదాలను అందజేశారు. అనంతరం పంచవటి కుటీరం, నారచీరల ప్రాంతాలను సందర్శించి వాటి విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట సీఐ వెంకటప్పయ్య, సిబ్బంది ఉన్నారు.

విద్యుత్ సామగ్రి వితరణ

దమ్మపేట: మండలంలోని మొద్దులగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దొడ్డా భాస్కరరావు.. అదే గ్రామంలోని ఓ వీధిలో అవసరమైన విద్యుత్ ఎల్ఈడీ లైట్ సెట్‌ను శుక్రవారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైట్లు లేని వీధుల్లో ఎల్ఈడీ లైట్ సెట్‌లను ఏర్పాటు చేయడానికి గ్రామస్తులు ముందుకు రావాలని కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత..



మందులను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ

గుండాల: ఏజెన్సీ గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ సైదులు అన్నారు. ఆళ్లపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఐటీడీఏ పీఓ రాహుల్ ఆదేశాల మేరకు వైద్యాధికారులు సంఘమిత్ర, రేవంత్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయగా.. ఆయన మాట్లాడారు. సీజనల్ వ్యాధులతో బాధపడే వారు ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేయించుకోవాలని, దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు మెరుగైన వైద్యం పొందాలన్నారు. స్థానిక ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే అందించాలని, పరిమితికి మించి వైద్యం చేయొద్దని హెచ్చరించారు. కాగా, 500 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. చెస్ట్ ఎక్స్‌రే, కంటి పరీక్షలు, దంత పరీక్షలు సైతం నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌యాదవ్, ఎంపీడీఓ శ్రీనివాస్, వైద్యులు శేఖర్, కనకరాజు, సోనిక, సాయిచరిష్మా, భద్రు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే జారె

చండ్రుగొండ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ దిశగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన సాగిస్తోందని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన లబ్ధిదారులకు అందించి మాట్లాడారు. అనారోగ్యం పాలైన పేదలకు అయిన ఖర్చులో కొంత మేర ప్రభుత్వం భరిస్తోందని తెలిపారు. అనంతరం మండలంలోని అయన్నపాలెంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు దుస్తులు పంపిణీ చేశారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి గ్రామంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన విషయం విదితమే. అయితే, నిర్మాణాలు పూర్తి చేసుకున్న మొత్తం 25 ఇళ్ల లబ్ధిదారులకు దుస్తులు పెడతామని ఎమ్మెల్యే సీఎం ఎదుటే ప్రకటించారు. ఈ క్రమంలో గ్రామంలో పర్యటించి లబ్ధిదారులకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బి.అశోక్, భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, బాబు, నల్లమోతు రమణ, కొండలు, కిరణ్‌రెడ్డి, ఫజల్, ఇమ్రాన్, బొర్రా సురేశ్ పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగించాలి



అవగాహన కల్పిస్తున్న ఏడీఏ రవికుమార్

ములకలపల్లి: రైతులు నానో యూరియా ద్రావణం వినియోగించడంపై దృష్టి సారించాలని అశ్వారావుపేట ఏడీఏ రవికుమార్ సూచించారు. మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. ఎరువుల గోదామును తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నానో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. అర లీటర్ నానో యూరియా సీసా, 45 కిలోల యూరియా గుళికల బస్తాతో సమానమని తెలిపారు. ఈ ద్రావణాన్ని పిచికారీ చేయాలని, ఎరువును వాడినట్లు భూమిలో వేయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఓ అరుణ్‌బాబు, సీఈఓ కుంచారపు శ్రీనివాసరావు, గోడౌన్ ఇంచార్జ్ మహేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'చరిత్రను వక్రీకరిస్తున్న పాలకులు'



మాట్లాడుతున్న కొక్కెరపాటి పుల్లయ్య

అశ్వారావుపేటరూరల్: స్వేచ్ఛ – స్వాతంత్ర్యం – పోరాటం అంటే తెలియక నేటి పాలకులు చరిత్రనే వక్రీకరిస్తున్నారని సీపీఎం జిల్లా నాయకులు కొక్కెరపాటి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని నందిపాడు గ్రామంలో వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవ సభను నిర్వహించగా.. ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆ నాడు జరిగిన పోరాటం నేపథ్యం, సామాజిక పరిస్థితులపై ప్రస్తుత కేంద్ర పాలకులు, బీజేపీ నాయకులు చెప్పేది పూర్తిగా అవాస్తమన్నారు. కమ్యూనిస్టుల నాయకత్వంలో నాటి రాజరిక పాలనకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాల గురించి తెలుసుకోవాలని సూచించారు. సభలో పార్టీ మండల కార్యదర్శి సోడెం ప్రసాద్, నాయకులు మడకం నాగేశ్వరరావు, మాడి నాగేశ్వరరావు, చిచ్చోడి కన్నయ్య, కారం జోగారావు, మడకం రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినులతో ప్రిన్సిపాల్ సరిత

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు జెడ్పీహెచ్ఎస్‌లో ఈ నెల 4వ తేదీన జరిగిన జోనల్ స్థాయి క్రీడాపోటీల్లో ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ బాలికల పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎం.సరిత తెలిపారు. శుక్రవారం పాఠశాలలో ఆమె మాట్లాడుతూ.. ఖోఖో అండర్–14 విభాగంలో ఎస్.దీక్ష, జ్ఞానేశ్వరి, కబడ్డీ విభాగంలో కల్పన, తేజస్విని, కబడ్డీ అండర్–17 విభాగంలో రేణుక, షార్ట్‌పుట్, జావెలిన్‌త్రో, డిస్క్‌త్రోలలో లక్ష్మీప్రసన్న జిల్లాస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థినులను, పీఈటీ కొమురమ్మను ఆమె అభినందించారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న యలమంచి రవికుమార్

దుమ్ముగూడెం: మహా రాజకీయవేత్త సీతారాం ఏచూరి స్ఫూర్తితో ఈ దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాద బీజేపీకి వ్యతిరేకంగా ఉద్యమించాలని డీసీసీబీ మాజీ చైర్మన్ యలమంచి రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం వైఎస్ భవనంలో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సభ సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు యలమంచి వంశీకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో మోదీని గద్దె దింపేందుకు పలు రాజకీయ పక్షాలను సీతారాం ఏచూరి ఏకతాటిపైకి తీసుకొచ్చారని తెలిపారు. లౌకిక విలువల కోసం పోరాడిన నాయకుడని, దేశ రాజకీయాల్లో ఆయన లేని వెలితి స్పష్టంగా కనిపిస్తోందని చెప్పారు. సభలో సీపీఎం నాయకులు కారం పుల్లయ్య, మర్మం చంద్రయ్య, కొర్సా చిలకమ్మ, యలమంచి శ్రీనుబాబు, బొల్లి సత్యనారాయణ, సరియం కోటేశ్వరరావు, కొమరం చంటి, గుడ్ల రామ్మోహన్‌రెడ్డి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్ ఉన్ నబీ



మణుగూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

మణుగూరుటౌన్: మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా మణుగూరులో శుక్రవారం ఈద్ ఏ మిలాద్, మిలాద్ నబీ వేడుకలు నిర్వహించారు. స్థానిక శేషగిరినగర్‌లోని మసీద్‌లో నమాజ్ అనంతరం బస్టాండ్ నుంచి అంబేడ్కర్ సెంటర్ మీదుగా తిరిగి మసీద్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ర్యాలీలో మోయినుద్దీన్, ఇస్మాయిల్, జావిద్, ఖాసీం, ముస్తఫా, సిరాజ్, నూరుద్దీన్, అబ్దుల్లా, రహీంపాషా, చందా హుస్సేన్ వాహేద్, షారుఫ్, ఖమారే ఆలం పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి



వినతిపత్రం ఇస్తున్న ఏఎన్ఎంలు

దమ్మపేట: పనిభారం తగ్గించాలని కోరుతూ పట్వారిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఏఎన్ఎంలు.. వైద్యాధికారి దివాకర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఫీల్డ్, ఆఫ్‌లైన్ వర్కులతో పాటుగా అదనంగా ఆన్‌లైన్ వర్క్ కేటాయించడంతో పనిభారం పెరిగి తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నామని తెలిపారు. దీంతో పలు రకాల అనారోగ్య సమస్యలతో పాటుగా మానసిక రుగ్మతలు ఎదురవుతున్నాయని వెల్లడించారు.